క్లుప్తంగా

నెమలి వాహనంపై సుబ్రహ్మణ్యుడి ఊరేగింపు



ఉభయ దేవేరులతో స్వామివారి ఊరేగింపు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో స్వామివారి దివ్య కల్యాణోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారు ఉభయ దేవేరులతో కలసి నెమలి వాహనంపై క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. ప్రతి ఇంట ముంగిట భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరునికి నీరాజనాలు సమర్పించారు. ఈ వేడుకలో ఆలయ సూపరింటెండెంట్ మద్దాల శ్రీను, గుమస్తా మెట్టపల్లి సూరిబాబు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన



విద్యార్థుల మానవహారం

కొయ్యలగూడెం: ఓటర్లకు అవగాహన కార్యక్రమం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎస్ఎన్ కళాశాలకు చెందిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మానవహారం నిర్మించి ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు.

హైస్కూల్లో విజిలెన్స్ కమిటీ తనిఖీలు



మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: రామసింగవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం అమలు తీరు, వసతులు, మంచినీటి సదుపాయాలను పరిశీలించారు. ఆహార నాణ్యత, రుచి, మెనూ అమలుపై విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పథకం అమలులో ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఉపాధ్యాయురాలు గంగాభవాని సమక్షంలో పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో వినియోగదారుల క్లబ్ సభ్యులచే ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, వినియోగదారుల కమిషన్లు, వాటి పనితీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధానేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు విజయదుర్గ, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంగిడిగూడెం విద్యార్థి ప్రతిభ



ప్రశంసా పత్రం అందిస్తున్న ఏడీ రాకడ మణి

ఏలూరు (టూటౌన్): ఈనెల ఒకటో తేదీన ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీల్లో ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబర్చాడు. షాట్‌పుట్ సీనియర్ విభాగంలో కె.పవన్ కుమార్ ప్రథమస్థానం, జావెలిన్ త్రోలో ప్రథమ స్థానం సాధించినట్లు పాఠశాల హెచ్ఎం పి.సురేష్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని విభిన్న ప్రతిభావంతుల జిల్లా కార్యాలయం నందు ఏడీ పి.రాకడ మణి పాఠశాల హెచ్ఎం సురేష్, పీఈటీ మల్లయ్యకు ప్రశంసా పత్రం, బహుమతిని అందజేశారు.

వ్యాసరచన పోటీలు

జంగారెడ్డిగూడెం: ఇంధనాన్ని పొదుపు చేసి భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఇంధన వారోత్సవాలు నిర్వహించారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో 8, 9 వ తరగతి విద్యార్థులు 46 మంది పాల్గొన్నారు.

రైతుల జాబితా ప్రదర్శన

జంగారెడ్డిగూడెం: మిచాంగ్ తుపానుకు జంగారెడ్డిగూడెం మండలంలోని నష్టపోయిన పంటల వివరాలను సర్వే చేసి రైతుల జాబితాలను రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల్లో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు ప్రదర్శిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి పోశారావు తెలిపారు. ఎవరికైనా రైతులకు అభ్యంతరాలు ఉంటే వెంటనే రైతు భరోసా కేంద్రాలలో తెలియజేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం.. ప్రగతికి మార్గం

- ఘన, ద్రవ జీవామృతాలపై రైతులకు అవగాహన
- ద్వారకాతిరుమల మండలంలో 1,818 ఎకరాల్లో సాగు
- ప్రకృతి వ్యవసాయంపై నానాటికీ పెరుగుతున్న మక్కువ



గుండుగొలనుకుంటలో ప్రకృతి వ్యవసాయం కోసం తయారవుతున్న కషాయాలు



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను విక్రయిస్తున్న దృశ్యం (ఫైల్)

ద్వారకాతిరుమల: ప్రకృతి వ్యవసాయం సాగుదారులకు ప్రగతి బాటగా మారుతోంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ సంయుక్తంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సేంద్రియ ఎరువులు, కషాయాలు, ద్రావణాల తయారీ విధానంపై అవగాహన పెంచుతున్నారు. ద్వారకాతిరుమల మండలంలోని 6 పంచాయతీల్లో 1,731 మంది రైతులు, 1,818 ఎకరాల్లో పూర్తి స్థాయి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. మండలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన పంటలను ఇక్కడ ప్రజలకే అందుబాటులో ఉంచుతున్నారు. దీని వల్ల రైతులకు లబ్ధి చేకూరుతోంది. దీంతో సాగు పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి ఒబిలిశెట్టి గోపాలకృష్ణ జీవామృతాల తయారీ విధానాలను వివరించారు.

బీజామృత తయారీ ఇలా..

బీజామృత తయారీకి ఆవుపేడ 5 కేజీలు, ఆవు మూత్రం 5 లీటర్లు, సున్నం 50 గ్రాములు, పుట్టమట్టి పిడికెడు, 20 లీటర్ల నీరు సిద్ధం చేసుకోవాలి. ఒక మట్టి పాత్రలో 20 లీటర్ల నీరు తీసుకుని, పేడను గుడ్డలో మూటగట్టి, నీటిలో వేలాడ తీయాలి. అందులో ఆవు మూత్రం, సున్నం కలపాలి. దీనిని 12 గంటల సమయం పాటు ఉంచాలి. రోజుకు రెండు పర్యాయాలు కర్రతో కలియ తిప్పాలి.

ఉపయోగాలు ఇవి..

బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవచ్చు. విత్తడానికి సిద్ధంగా ఉన్న విత్తనాలపై ఈ మిశ్రమాన్ని చల్లాలి. నీడలో ఆరబెట్టిన తర్వాత విత్తుకోవాలి. దీంతో విత్తనం బాగా మొలకెత్తుతుంది. విత్తనం నుంచి సంక్రమించే వ్యాధులను నియంత్రిస్తోంది. అరటి పిలకలు, చెరుకు కణుపులు, వరి, ఉల్లి, మిరప, టమాటా, వంగ నార్లను బీజామృతాన్ని ముంచి నాటుకోవడంతో ఉపయోగం ఉంటోంది.

ఘన జీవామృతం తయారీ ఇలా..

ఘన జీవామృతం తయారీకి నాటు ఆవుపేడ 100 కిలోలు, బెల్లం 2 కేజీలు, నాటు ఆవు మూత్రం కావలిసినంత, పప్పు దినుసుల పిండి 2 కేజీలు, పొలం గట్టు మట్టి గుప్పెడు అవసరమవుతాయి. అన్ని పదార్థాలను కొద్దికొద్దిగా ఆవు మూత్రాన్ని చల్లుతూ కలపాలి. ఈ మిశ్రమాన్ని నీడలో పలుచగా పరిచి 7 రోజులు ఎండబెట్టాలి. ఎండిన తర్వాత పొడి చేసి గోనె సంచులలో నిల్వ చేసుకోవచ్చు. దీనిని 6 నెలల వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది.

ఉపయోగాలివి..

100 కేజీల ఘనజీవామృతాన్ని ఒక ఎకరం పొలానికి ఆఖరి దుక్కులో వేసుకోవాలి. 1, 2 నెలల తరువాత 100 కిలోల ఘన జీవామృతాన్ని ఒక ఎకరానికి పైపాటుగా సాళ్ల మధ్యలో వేసుకోవాలి. ఘన జీవామృతంలో పంటకు అవసరమైన పోషకాహారాలు ఉంటాయి. ముడిపదార్థాలు అందుబాటులో లభిస్తాయి.

ద్రవ జీవామృతం..

ద్రవ జీవామృత తయారికీ ఆవుపేడ 10 కేజీలు, ఆవు మూత్రం 10 లీటర్లు, నల్లబెల్లం లేదా చెరుకు రసం 2 కేజీలు, నీరు 200 లీటర్లు, పుట్టమట్టి, పొలంగట్టు మట్టి గుప్పెడు అవసరమవుతాయి. ఒక ప్లాస్టిక్ డ్రమ్ములో 200 లీటర్ల నీరు తీసుకోవాలి. దానికి 10 కేజీల ఆవుపేడ కలిపి, కర్రతో బాగా కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని మెత్తగా పొడి చేసి, బెల్లం, శనగపిండి కలపాలి. దానికి 10 లీటర్లు పశువుల మూత్రాన్ని, పిడికెడు మట్టిని కలిపి కర్రతో బాగా కలియబెట్టాలి. పాత్రపై గోనెసంచి కప్పి, ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సవ్య దిశలో కర్రతో కలియబెడుతూ ఉండాలి. 4 నుంచి 7 రోజుల తర్వాత పంటకు ఉపయోగించుకోవాలి.

అన్ని పంటలకు వినియోగించవచ్చు

ద్రవ జీవామృతాన్ని అన్ని పంటలకు ఉపయోగించవచ్చు. ఇది పెరుగుదలకే కాకుండా చీడపీడలను దరిచేరనీయదు. పండ్ల తోటలకు, ప్రతి చెట్టుకు 2–5 లీటర్ల ద్రవ జీవామృతం భూమిపై చల్లాలి. చుట్టూ చెట్టు నీడపడే పరిధిలో చల్లుకోవాలి. భూమిలో తేమ ఉన్నప్పుడు మాత్రమే చల్లుకోవాలి.

ప్రకృతి వ్యవసాయం మేలు



మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ సంఘ నిర్వాహక ప్రకృతి వ్యవసాయం (ఏపీ సీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కలిగిస్తున్నాం. స్థానిక వ్యవసాయశాఖ సిబ్బంది ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

– ఒబిలిశెట్టి గోపాలకృష్ణ, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి

ఆర్అండ్ఆర్ జాబితాలో పేర్ల మార్పుపై పరిశీలన



ఉప్పేరు గ్రామంలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

కుక్కునూరు: ఆర్అండ్ఆర్ జాబితాలో రెండు గ్రామాలకు సంబంధించి పేర్లు తారుమారయ్యాయనే గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మంగళవారం సంబంధిత అధికారులు పరిశీలన చేసి వివరాలు సేకరించారు. మండలంలోని ఆంబోతులగూడెం గ్రామం పోలవరం ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ పరిధిలో ఉండగా, ఉప్పేరు గ్రామం 45 కాంటూర్ పరిధిలో ఉంది. కాగా ఈ రెండు గ్రామాలకు సంబంధించి ఆర్అండ్ఆర్ జాబితాలో ఆంబోతులగూడెం గ్రామస్తుల పేర్లు ఉప్పేరు జాబితాలో, ఉప్పేరు గ్రామస్తుల పేర్లు ఆంబోతులగూడెం ఆర్ అండ్ఆర్ జాబితాలోకి తారుమారయ్యాయి. ఈ విషయమై గ్రామస్తులు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్‌ను కలిసి ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం పరిశీలన చేసి గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు.

శ్రీవారి గోవులకు వైద్య పరీక్షలు



శ్రీవారి గోసంరక్షణశాలలో ఆవుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మండల పశువైద్యాధికారి సురేష్

ద్వారకాతిరుమల: శ్రీవారి గోసంరక్షణ శాలలోని ఆవులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించినట్టు మండల పశువైద్యాధికారి అంగర సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా 80 ఆవులు, 15 ఆంబోతుల నుంచి రక్త నమూనాలను సేకరించి, వాటిని బ్రూసెల్లా, టీబీ, జేడీ వ్యాధుల స్క్రీనింగ్ నిమిత్తం ఏలూరు డీడీఎల్ (వెటరినరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్) వారి ద్వారా విజయవాడకు పంపినట్టు తెలిపారు. పలు ఆవులకు చూడి పరీక్షలు నిర్వహించామన్నారు. ఏలూరు ఏడీడీఎల్ ల్యాబ్ డాక్టర్ జయశ్రీ, గోశాల ఏఈఓ, ఎల్ఎస్ఏలు రామిరెడ్డి రవి, పశుసంవర్ధకశాఖ సిబ్బంది, గోశాల సిబ్బంది, డాక్టర్లు పాల్గొన్నారు.

పనిచేసే సంస్థల్లో సౌకర్యాలు కల్పించాలి

ఏలూరు (టూటౌన్): కార్మికులకు వారు పనిచేసే సంస్థల్లో ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ చెప్పారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యాన స్థానిక సత్రంపాడులోని అంబికా ఇండస్ట్రీస్ నందు కార్మికులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ పనికి తగిన వేతనం చెల్లించాలని, యంత్రాల వద్ద పనిచేసేటప్పుడు తగు రక్షణ చర్యలు తీసుకోవాలని, అసంఘటిత కార్మికులు ఈ–శ్రం పోర్టల్ నందు తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి



ఉపాధి హామీ పథకం మేట్ల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నమోదైన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండల సమాఖ్య కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మేట్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కూలీలకు పని కల్పించే విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని, బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఏపీవో జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మస్టర్ నిర్వహణ, కొలతలు, ఆన్‌లైన్‌లో కూలీల హాజరు నమోదు చేయడం వంటి విషయాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సీజన్‌లో చేసే పనుల వివరాలపై కూడా తెలియజేశామన్నారు. పనులు చేసే సమయంలో కూలీల మస్టర్ నిర్వహణపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్రీను, ఏవో సీహెచ్ శ్రీనివాస బాబు, ఈవో పీఆర్‌డీ శ్రీనివాస్, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమం.. వైఎస్సార్ సీపీకే సాధ్యం

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- కేతవరంలో గడపగడపకు మన ప్రభుత్వం



కేతవరంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

టి.నరసాపురం: సంక్షేమ పథకాల అమలులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జెట్ స్పీడ్‌లో దూసుకుపోతుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని కేతవరంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలు శివారు నివాసిత ప్రాంతాలకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అని అన్నారు. వృద్ధులకు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.2750 ఇచ్చే పింఛన్‌ను వచ్చే నెల నుంచి రూ.3 వేలకు పెంచిన మానవతావాది జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఇది చేతల ప్రభుత్వం అన్నారు. అర్హులైన లబ్ధిదారులకు జలకళ బోర్ల నిర్మాణం చేశామని ఇంకా మిగిలిన లబ్ధిదారులకు త్వరలోనే బోర్లు నిర్మిస్తామని వివరించారు. కేతవరం గ్రామంలో టీడీపీ హయాంలో పట్టాలిచ్చి పొజిషన్ చూపకుండా లబ్ధిదారులను గాలికి వదిలివేశారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సభ ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పట్టాలు ఇస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ గురుకుల వసతిగృహం నిర్మాణానికి గ్రామంలో స్థలం గుర్తింపు జరిగిందని, వసతిగృహం మంజూరు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి మంజూరుకు కృషిచేయనున్నట్లు వివరించారు.

శంకుస్థాపనలు

సర్పంచ్ తడికలపూడి శివమాధవి కిషోర్ ఆధ్వర్యంలో గ్రామంలో ఎస్సీ ఏరియాలో రూ.5 లక్షల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన డ్రెయినేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే బాలరాజు శంకుస్థాపన చేశారు. అలాగే మెయిన్ విలేజ్‌లో రూ.5 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఎస్సీ ఏరియాలో తాగునీటి బోరు నిర్మాణానికి అవసరమైన 10 సెంట్ల స్థలాన్ని దానంగా ఇచ్చిన ఘంటా మనోహర్‌రావును ఎమ్మెల్యే బాలరాజు, సర్పంచ్ తడికలపూడి శివమాధవి కిషోర్ శాలువాతో సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనురాజు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, ఎంపీటీసీలు బండి వెంకట సుబ్బారావు, బొడ్డపాటి రాంబాబు, దారబోయిన వెంకటేశ్వరరావు, వంటిపల్లి వెంకటేశ్వరరావు, వంటిపల్లి సుబ్రహ్మణ్యం, యర్రా గంగాధరరావు, బోళ్ల రంగారావు, కె.సర్వేశ్వరరావు, తేజ తదితరులు పాల్గొన్నారు.

జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి



టి.నరసాపురం: నష్టపోయిన రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రం వద్ద ప్రదర్శిస్తున్న దృశ్యం



పోలవరం రూరల్: కొత్తపట్టిసీమలో ఆర్బీకే వద్ద పంట నష్టం వివరాల జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

టి.నరసాపురం: మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలో 1392 మంది రైతులకు చెందిన 1246 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు నష్టపోయినట్లు గుర్తించామని మండల వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు తెలిపారు. నష్టపోయిన రైతుల వివరాలను సామాజిక తనిఖీ నిమిత్తం వ్యవసాయాధికారి కార్యాలయంలోనూ, సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించినట్లు చెప్పారు. 422 మంది రైతులకు చెందిన వరి పంట 293 ఎకరాలకు నష్టం వాటిల్లిందని, 507 మంది రైతులకు చెందిన 441 ఎకరాల్లో మొక్కజొన్న, 342 మంది రైతులకు చెందిన 388 ఎకరాల్లో పొగాకు, 116 మంది రైతులకు చెందిన 118 ఎకరాల్లో వేరుశనగ, ఐదుగురికి చెందిన ఆరెకరాల్లో పత్తిపంట దెబ్బతిన్నాయని వివరించారు. రైతులు వారి పేర్లను తనిఖీ చేసి మార్పులు, చేర్పులు ఉన్నట్లయితే తెలియజేయాలని సూచించారు.

పోలవరం రూరల్: తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను ఎన్యుమరేషన్ పూర్తిచేసి నష్టపోయిన రైతుల వివరాలను ప్రదర్శించడం జరిగిందని, రైతులకు అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు తెలిపారు. పోలవరం మండలంలోని కొత్తపట్టిసీమ, గూటాల, పోలవరం, పట్టిసీమ రైతు భరోసా కేంద్రాల్లో మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతుల లబ్ధిదారుల జాబితాను మంగళవారం ప్రదర్శించారు. మండలంలోని జాబితాలు పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే 22వ తేదీ లోపు ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదులు అందిన తరువాత గ్రామ స్థాయి కమిటీ క్షేత్ర పరిశీలన చేసి ఫిర్యాదులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్రీను, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, రైతులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కొదమ జ్యోతి

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. జంగారెడ్డిగూడెంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొదమ జ్యోతి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈసందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సబ్సిడీలు వంటి వివరాలను అధికారులు సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జ్యోతి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. పథకాలను అర్హులకు సక్రమంగా అందించేలా అధికారులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్లీవజోజి, ఎంపీడీవో కె.విజయ్‌ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ల పంపిణీ



మహిళలకు కుట్టుమెషీన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ తల్లాడ సత్తిపండు 3వ వర్ధంతిని పురస్కరించుకుని గ్రీన్ సంస్థ వ్యవస్థాపకురాలు గీతానారాయణన్ ఆధ్వర్యంలో మంగళవారం పేద మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. అలాగే జంగారెడ్డిగూడెం బాలుర, బాలికల హైస్కూల్‌లో 2022–23లో 10వ తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.9 వేలు, రూ.6 వేలు, రూ.3 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించారు. తొలుత గౌడ కమ్యూనిటీ హాల్ వద్ద, ఏలూరు రోడ్డులో ఉన్న తల్లాడి సత్తిపండు విగ్రహానికి కుమార్తె గీతానారాయణన్, కుమారుడు తల్లాడ శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, వాసవీరత్నం, వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితి పెంపు చరిత్రాత్మకం



లబ్ధిదారుడికి స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డును అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: పేదలకు సంజీవని వంటి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్సల వ్యయ పరిమితి రూ.25 లక్షలకు పెంచుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు అన్నారు. ద్వారకాతిరుమలలో మంగళవారం గ్రామ సర్పంచ్ కుంటం స్వర్ణలత, పార్టీ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉక్కుర్తి వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలతో కలసి నాగేశ్వరరావు పలు ఇళ్లకు వెళ్లి ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొత్త ఫీచర్లతో కూడిన స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు సూచించారు.

అభ్యర్థులు 21న హాజరు కావాలి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయంలో ఒక సంవత్సర కాలానికి తాత్కాలిక ప్రాతిపదికన పనిచేయుటకు రెండు అసిస్టెంట్ అకౌంటెంట్ గ్రేడ్ ఐఐఐ, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే అసిస్టెంట్ అకౌంటెంట్ గ్రేడ్ ఐఐఐ పోస్టుకు 55 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యా అర్హత ధ్రువపత్రాలు, అటెస్టేషన్ చేసిన వేరొక కాపీతో సహా జిల్లా కలెక్టర్ ప్రాంగణంలో గల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయంలో ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు వ్యక్తిగతంగా హాజరు కావాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.